క్లుప్తంగా

విద్యుత్ ఉండని ప్రాంతాలు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు సెక్షన్ అసిస్టెంట్ ఇంజినీర్ హ్యాపీరామ్ తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 వరకు ఈ కోత ఉంటుందన్నారు. బుద్వేల్, భగవతిగూడ, జనచైతన్య ఫేస్–1,2,3, మయూరి విల్లా, గోల్డెన్ హైట్స్ కాలనీ, చింతల్‌మెట్, ఎంఎం పహాడీ, సెట్విన్, జలాల్ బాబానగర్, ఇమాద్‌నగర్ తదితర ప్రాంతాల్లో మరమ్మతుల కారణంగా ఈ కోత ఉంటుందన్నారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సిబ్బందికి సహకరించాలని కోరారు.

మైలార్‌దేవ్‌పల్లిలో..

- గగన్‌పహాడ్ గ్రీన్ విచ్ సబ్‌స్టేషన్ పరిధిలో సోమవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 వరకు విద్యుత్ సరఫరా ఉండదని సెక్షన్ అసిస్టెంట్ ఇంజినీర్ జుబేరుద్దీన్ ప్రకటించారు. లక్ష్మిగూడ, రాజీవ్ గృహకల్ప, బృందావన్ కాలనీ, వాంబే కాలనీ, హౌజింగ్ బోర్డు కాలనీ, కాటేదాన్ విద్యుత్ స్టేషన్ పరిధిలోని రోషన్ కాలనీ, సైఫ్ కాలనీ, అక్బర్ కాలనీ, షమాకాలనీ తదితర ప్రాంతాల్లో ఈ కోత ఉంటుందన్నారు.

పెరిగిన చికెన్ ధరలు

మణికొండ: నూతన సందర్భంగా చికెన్ వ్యాపారులు ధరలను పెంచి అమ్మకాలను చేపట్టారు. ఆయా సంస్థలు ప్రకటించిన ధరలను కాదని షాపుల వారు ఇష్టానుసారంగా ధరలను పెంచారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రతి కేజీపై రూ. 50 వరకు పెంచి అమ్మకాలు చేపట్టారని పలువురు కొనుగోలు దారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై మున్సిపల్ అధికారులకు ఫిర్యాదులు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని వారు వాపోతున్నారు.

ప్రత్యేక ప్రార్థనలు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్‌లోని చర్చిలల్లో నూతన సంవత్సరం సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. మన్నాపుల్ గాస్పెల్ చర్చిలో రెవరెండ్ సీ.హెచ్.జాన్ మోజెస్, ప్రభావతి ఆధ్వర్యంలో ప్రత్యేక ఆరాధనలు నిర్వహించారు. నూతన కేలండర్‌ను ఆవిష్కరించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు చెప్పారు. అనంతరం సామూహిక భోజనాలు ఏర్పాటు చేశారు.

వైభవంగా అయ్యప్ప మహాపడి పూజ



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

శంషాబాద్: శంషాబాద్ మాజీ సర్పంచ్, టీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఆర్. గణేష్‌గుప్తా ఆధ్వర్యంలో మహిళామండలి ప్రాంగణంలో ఆదివారం అయ్యప్ప మహాపడి పూజను ఘనంగా నిర్వహించారు. వేలాది మంది అయ్యప్పభక్తుల రాకతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. మహాపడి పూజలో ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ వైస్‌చైర్మన్ బండిగోపాల్‌యాదవ్, కౌన్సిలర్లు అజయ్ తదితరులు పాల్గొన్నారు.

నూతన సంవత్సర వేడుకలు !



కేపీఆర్ కాలనీలో..



మణికొండలో బీఆర్ఎస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ రామకృష్ణారెడ్డి తదితరులు

మణికొండ: ఆంగ్ల సంవత్సరానికి గండిపేట్ మండల ప్రజలు ఘనంగా స్వాగతం పలికి ఘనంగా ఉత్సవాలు నిర్వహించుకున్నారు. అర్ధరాత్రి 12 గంటలకు కేక్‌లు కట్ చేసి బాణాసంచా కాలుస్తూ.. ఒకరికొకరు శుభాకాంక్షలు చెప్పుకుని సంబరాలు చేసుకున్నారు. ఆదివారం ఉదయం కొత్త సంవత్సరం శుభంగా గడవాలని, అనుకున్న లక్ష్యాలు నెరవేరాలని, తమ కుటుంబాలు సుఖ, సంతోషాలతో ఉండాలని కోరుతూ ప్రజలు తమ ఇష్ట దైవం దేవాలయానికి వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

శంషాబాద్ రూరల్: మండలంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు. శనివారం రాత్రి పాత సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ కొత్త ఏడాదికి స్వాగతం చెబుతూ.. ఉత్సాహంగా గడిపారు. అర్ధరాత్రి దాటిన తర్వాత కేక్‌కట్ చేసి ఆటపాటలతో సందడి చేశారు.

ఆలయాలకు పెద్ద సంఖ్యలో భక్తులు

రాయదుర్గం: కొత్త ఏడాది మొదటి రోజు ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. ఆదివారం పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవార్లను, స్వామివార్లను దర్శించుకున్నారు. ఉదయం నుంచే అన్ని ఆలయాలకు కుటుంబ సభ్యులతో కలిసి ప్రజలు చేరుకున్నారు. పెద్ద ఎత్తున పూజలు చేశారు.

అసంపూర్తిగా అభివృద్ధి పనులు!



దస్ట్‌ను రోడ్డుపై డంప్ చేసిన దృశ్యం



ఆప్కో కాలనీలో తవ్వి వదిలేసిన రోడ్డు

మైలార్‌దేవ్‌పల్లి: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు నత్తనడకన సాగుతున్నాయి. గత మూడు నెలల క్రితం ప్రారంభించిన సీసీ రోడ్డు నిర్మాణ పనులు నేటికి పూర్తి కాకపోవడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కాంట్రాక్టర్ రోడ్డును ఎక్కడికక్కడ తవ్వి వదిలేయడంతో పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి.

- మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ ఆప్కో కాలనీ బొడ్రాయి రెండో వీధిలో అసంపూర్తిగా పనుల కారణంగా ఓ వృద్ధుడు రోడ్డు దాటుతూ తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందాడు.
- ఓ వ్యక్తి మృతి చెందిన జీహెచ్ఎంసీ అధికారుల్లో ఎలాంటి చలనం లేకుండాపోయిందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.
- రోడ్డు నిర్మాణంతో పాటు డ్రైనేజీ తదితర సమస్యలను సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంపై స్థానికులు ప్రశ్నిస్తున్నారు.
- ప్రతీ ఇంటికి రూ.5 వేల చొప్పున చందాలు వేసుకుని తామే డ్రైనేజీ పనులను చేపట్టుకునేందుకు చర్యలు తీసుకుంటామని కాలనీ అసోసియేషన్ సభ్యులు చెబుతున్నారు. నిలిచిపోయిన పనులను యుద్ధ ప్రాతిపదికన ప్రారంభించి వెంటనే పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.



ప్రమాదభరితంగా ఉన్న డ్రైనేజీ మ్యాన్‌హోల్.



ఆప్కో కాలనీలో చేపడుతున్న భవన నిర్మాణం

రోడ్డును ఆక్రమించి నిర్మాణం

మైలార్‌దేవ్‌పల్లి: అనుమతులు లేకుండా బహుళ అంతస్తుల నిర్మాణాలు చేపడుతున్నా జీహెచ్ఎంసీ అధికారుల్లో ఎలాంటి చలనం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రాజేంద్రనగర్ సర్కిల్ మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో అనుమతులు లేకుండా 20 ఫీట్ల రోడ్డు మార్గాన్ని 17 నుంచి 18 ఫీట్లకు తగ్గించి నిర్మాణాలు చేపడుతున్నారని స్థానికులు వాపోతున్నారు. ఆప్కో కాలనీలో పరిసర ప్రాంతాల్లో అక్రమంగా నిర్మిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

ఆలయాలకు పోటెత్తిన భక్తులు



అమ్మపల్లి దేవాలయంలో..

శంషాబాద్ రూరల్: నూతన ఏడాది సందర్భంగా భక్తులు ఆలయాలకు పోటెత్తారు. మండలంలోని నర్కూడ శివారులోని అమ్మపల్లి శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయాన్ని భక్తులు ఆదివారం అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. చుట్టు పక్కల గ్రామాలతో పాటు నగరం నుంచి భక్తులు వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఆదివారం సెలవుదినం కావడంతో భక్తుల తాకిడి పెరిగింది. ఆలయం ప్రధాన గోపురం మరమ్మతు పనుల కారణంగా తూర్పు ద్వారాన్ని మూసివేశారు. దీంతో ముందుగానే ఉత్తర ద్వారం నుంచి భక్తులు లోపలికి వెళ్లేందుకు ఏర్పాట్లు చేశారు.

- ముచ్చింతల్‌లోని శ్రీరామనగరంలో ఉన్న దివ్య సాకేతాలయానికి సైతం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.



కోనేరు వద్ద భక్తుల సందడి

నేడు ప్రత్యేక పూజలు..

వైకుంఠ ఏకాదశి సందర్భంగా సోమవారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించేందుకు ఏర్పాట్లు చేశారు. తెల్లవారుజామున ప్రత్యేక పూజల అనంతరం భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పిస్తారు.

బీజేపీ శక్తి కేంద్రం సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న అర్బన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్

రాజేంద్రనగర్: నియోజకవర్గంలో బీజేపీ ఎదురు లేని శక్తిగా ఉందని రంగారెడ్డి అర్బన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్ అన్నారు. అత్తాపూర్ డివిజన్ హైదర్‌గూడలోని బీజేపీ కార్యాలయంలో జిల్లా ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి సులిగే వెంకటేష్ ఆధ్వర్యంలో శక్తి కేంద్రం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీని బూత్ స్థాయి నుంచి బలోపేతం చేసేందుకు శక్తి కేంద్రాల సభ్యులు కష్టపడి పనిచేయాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు అందేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో నారగూడెం మల్లారెడ్డి, ఎస్.విజయ్, శ్రీకాంత్‌చారి, శివ, రాజ్‌గౌడ్, సాయివంశీ, మహేష్, సంతు, భరత్, అఖిల్, హరి, రాజు తదితరులున్నారు.

ముగిసిన క్రికెట్ టోర్నమెంట్

బండ్లగూడ: క్రీడలతో శారీర ధృడత్వం, ఉత్సాహం పెరుగుతాయని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్ రెడ్డి అన్నారు. త్రిమిటీ సురేష్ జ్ఞాపకార్థం బీఎంఆర్ క్రికెట్ గ్రౌండ్‌లో క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించారు. మొదటి స్థానంలో హైదర్షాకోట్ 4వ డివిజన్ రవీందర్‌రెడ్డి, 5వ డివిజన్ శ్రీనాథ్‌రెడ్డిల టీమ్‌లు తొలి స్థానంలో నిలవగా.. రెండోస్థానాన్ని బైరాగిగూడ టీమ్ కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా గెలుపొందిన టీమ్‌లకు ట్రోఫీలను అందజేశారు. కార్పొరేటర్ తలారి చంద్రశేఖర్, రాజిరెడ్డి, నరేందర్, శ్రీనివాస్‌రెడ్డి, చింతల శ్రీనివాస్, మహేశ్వర్ రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి తదితరులున్నారు.



విజేతలకు ట్రోఫీని అందజేస్తున్న దృశ్యం

కేలండర్ ఆవిష్కరణ

మణికొండ: మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని మహర్షి బోయ వాల్మీకి సంఘం నూతన సంవత్సర కేలండర్‌ను ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాల్మీకి సంఘం సభ్యులు కలిసికట్టుగా ఉండి అభివృద్ధిని సాధించాలని వారి అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామన్నారు. బీఆర్ఎస్ పార్టీ మున్సిపాలిటీ ఫ్లోర్ లీడర్ రామకృష్ణారెడ్డి, కౌన్సిలర్‌లు వసంతరావు, శైలజ, మున్సిపాలిటీ అధ్యక్షుడు శ్రీరాములు, బీఆర్ఎస్‌వీ నియోజకవర్గ అధ్యక్షుడు శ్రావణ్‌కుమార్, వాల్మీకి సంఘం అధ్యక్షుడు శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడు ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి విజయ్‌నాయుడు, కోశాధికారి సహదేవ్ నాయుడు, కార్యనిర్వాహక కార్యదర్శి రాజు, ఉప కార్యదర్శి వెంకటేష్‌తో పాటు కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

భాగ్యలక్ష్మి కాలనీ ఆలయంలో..

మణికొండ: మున్సిపాలిటీ పరిధి భాగ్యలక్ష్మికాలనీలోని శ్రీ దుర్గామాత దేవాలయ నూతన సంవత్సర కేలండర్‌ను ఆవిష్కరించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు మల్లారెడ్డి మాట్లాడుతూ.. ప్రతి ఏడాది దేవాలయానికి భక్తుల సంఖ్య పెరుగుతుందని అదే తరహాలో దేవాలయ అభివృద్ధి నిర్వహణకు తమ వంతు కృషి చేస్తున్నామన్నారు. దేవాలయంలోని కల్యాణమండపంలో ఫ్లోరింగ్ పనులను పరిశీలించారు. కమిటీ సభ్యులు లక్ష్మిరెడ్డి, బాల్‌రెడ్డి, దేవరాజులనాయుడు, ఈదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ పద్మావతిపాపయ్యయాదవ్

పోచమ్మ ఆలయంలో..

బండ్లగూడ: కార్పొరేషన్ పరిధి పద్మశ్రీహిల్స్‌లోని పోచమ్మ అమ్మవారి నూతన సంవత్సర కేలండర్‌ను 7వ డివిజన్ కార్పొరేటర్ పద్మావతిపాపయ్యయాదవ్ ఆవిష్కరించారు. స్థానికులు శివప్రసాద్, సురేందర్ తదితరులున్నారు.



వాల్మీకి సంఘం కేలండర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్



శిల్పారామానికి 'కొత్త' శోభ

గచ్చిబౌలి: కొత్త ఏడాది సందడి మాదాపూర్‌లోని శిల్పారామంలో కనిపించింది. ఉదయం నుంచి రాత్రి వరకు 15 వేల మంది సందర్శకులు వచ్చినట్లు అధికారులు పేర్కొన్నారు. శిల్పారామంలో అందాలను తిలకిస్తూ సందర్శకులు పులకించిపోయారు. ఆదివారం కావడంతో పెద్ద సంఖ్యలో సందర్శకులు రావడంతో శిల్పారామం ప్రాంగణమంతా సందర్శకులతో కిటకిటలాడింది.



242 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు

గచ్చిబౌలి: నూతన సంవత్సరం వేడుకలను పురస్కరించుకొని పోలీసులు ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్ కార్యక్రమాన్ని గచ్చిబౌలి, మాదాపూర్ ప్రాంతాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా 242 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులను పోలీసులు నమోదు చేశారు. గచ్చిబౌలి పరిధిలో 5 ప్రాంతాల్లో, మాదాపూర్ పరిధిలో 6 ప్రాంతాల్లో డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలను నిర్వహించారు. మద్యం తాగి వాహనాలు నడిపిన వారిపై కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

అధికారులకు సన్మానం

గచ్చిబౌలి: ఎస్ఆర్‌డీపీ ప్రాజెక్టుల నిర్మాణ సమయంలో రోడ్లు, ఫ్లైఓవర్లు ఇతర వాటి నిర్మాణం సందర్భంగా ప్రైవేటు ఆస్తుల సేకరణలో కీలక పాత్ర పోషించిన అధికారులను సన్మానించారు. కొత్తగూడ ఫ్లైఓవర్ నిర్మాణ సమయంలో వెస్ట్‌జోన్ డిప్యూటీ చీఫ్ ప్లానర్ గణపతి, శేరిలింగంపల్లి సర్కిల్ టీపీఎస్ రవీందర్‌ను రాష్ట్ర ఐటీ శాఖా మంత్రి కేటీఆర్, ప్రభుత్వ విప్ ఆరెకపూడి గాంధీ, ఎంపీ రంజిత్‌రెడ్డి సమక్షంలో విద్యాశాఖ మంత్రి సబితా రెడ్డి వారిని శాలువాలతో సత్కరించారు.

ఆడి పాడిన విద్యార్థులు

గోల్కొండ: టోలిచౌకి రవీంద్రభారతి పాఠశాలలో నూతన సంవత్సర వేడుకలు ఉత్సాహంగా సాగాయి. పిల్లలు ఫ్యాన్సీ డ్రెస్సులతో అందరినీ ఆకట్టుకున్నారు. ఉల్లాసంగా, ఉత్సాహంగా హ్యాపీ న్యూఇయర్ అంటూ కేరింతలతో సందడి చేశారు. జోన్ డీన్ ప్రియా మనీష్, ప్రిన్సిపల్ బి.శశికళ తదితరులు పాల్గొన్నారు.

మురాద్‌నగర్ ఆర్‌బీఎస్‌లో..

మురాద్‌నగర్‌లోని రవీంద్రభారతి పాఠశాలలో న్యూఇయర్ వేడుకలు ఘనంగా జరగాయి. పిల్లలు ఉత్సాహంగా కేక్ కట్ చేసి ఉపాధ్యాయులతో పాటు స్నేహితులకు పంచారు.

డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుపడిన 69 మంది

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో చేపట్టిన డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 69 మంది మందుబాబులు పట్టుబడినట్లు ఇన్‌స్పెక్టర్ శ్యామ్ సుందర్‌రెడ్డి తెలిపారు. రాత్రి 11 గంటల నుంచి తెల్లవారుజామున 3 వరకు తనిఖీలు చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. దుర్గానగర్, ఆరాంఘర్, ఈశ్వర్ థియేటర్, మొయినాబాద్ రోడ్డు, రాజేంద్రనగర్ ప్రాంతాల్లో ఈ డ్రంక్ అండ్ డ్రైవ్‌ను చేపట్టినట్లు వివరించారు.

- 50 ద్విచక్ర వాహనదారులు, 15 మంది కారు యజమానులు, నలుగురు ఆటో డ్రైవర్లు ఈ తనిఖీల్లో పట్టుబడినట్లు సమాచారం.
- డిసెంబర్ 31 నేపథ్యంలో రాత్రి 7 గంటల నుంచే స్టేషన్ పరిధిలోని ప్రధాన రహదారులపై ట్రాఫిక్ పోలీసులతో బందోబస్తును ఏర్పాటు చేశామన్నారు.
- ఓఆర్ఆర్‌తో పాటు పీవీ నరసింహారావు ఎక్స్‌ప్రెస్‌వేలపై కేవలం ఎయిర్‌పోర్టుకు వెళ్లే ప్రయాణికులకు మాత్రమే అనుమతి ఇచ్చామన్నారు.
- ప్రధాన రహదారులపై భారీ క్రేన్‌లను ఏర్పాటు చేసి మితిమీరిన వేగంతో వెళ్లకుండా ప్రత్యేక చర్యలు చేపట్టడంతో ఎలాంటి ప్రమాదాలు జరగలేదన్నారు.



రాజేంద్రనగర్ రహదారిపై తనిఖీలు చేపడుతున్న ట్రాఫిక్ పోలీసులు

- నూతన సంవత్సరాన్ని తమ సిబ్బందితో విధి నిర్వహణలోనే స్వాగతం పలికామని వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడపవద్దని సూచించారు.
- ఎప్పటికప్పుడు డ్రంక్ అండ్ డ్రైవ్‌లను ఆకస్మికంగా నిర్వహిస్తున్నామని ట్రాఫిక్ రూల్స్‌ను అందరూ తప్పనిసరిగా పాటించాలన్నారు.
- ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్‌లను ధరించాలని, నెంబర్ ప్లేట్‌లను సగం మేర విరగొట్టడం, నెంబర్లు కనిపించకుండా చేయడం తదితర వాటిని గుర్తించి జరిమానాలను విధిస్తున్నామని తెలిపారు. ట్రాఫిక్ సిగ్నల్ వద్ద తప్పనిసరిగా నియమనిబంధనలను పాటించాలని కోరారు.

నూతన సంవత్సర శుభాకాంక్షల వెల్లువ



ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ ఎంపీపీ మల్లేష్ తదితరులు



మంత్రి హరీష్‌రావుకు శుభాకాంక్షలు తెలిపిన నార్సింగి కౌన్సిలర్



కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డిని డివిజన్ మహిళా మోర్చా అధ్యక్షురాలు లక్ష్మి ఆధ్వర్యంలో ఆ పార్టీ నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. కాటేదాన్‌లోని బీజేపీ కార్యాలయంలో ఆయనను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి ఘనంగా సన్మానించారు. కార్యదర్శి తిరుపతమ్మ, కోశాధికారి విమలమ్మ, లత, శక్తి కేంద్రం ఇన్‌చార్జి జయంతి, భారతి, నాగమణి తదితరులున్నారు.

మణికొండ: నూతన సంవత్సరం సందర్భంగా తమ నాయకులకు ప్రజాప్రతినిధులు కలిశారు. మంత్రి హరీష్‌రావును నార్సింగి మున్సిపాలిటీ కౌన్సిలర్ పత్తి ప్రవీణ్‌కుమార్, ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌ను మాజీ ఎంపీపీ తలారి మల్లేష్ తన మిత్రులతో కలిసి శుభాకాంక్షలు చెప్పారు. మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల పరిధిలో పలువురు ప్రజాప్రతినిధులకు వార్డు నాయకులు, కాలనీ సంఘాల నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. కొత్త ఏడాదికి స్వాగతం పలుకుతూ తెల్లవారుజామునే దేవాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్ర హోంమంత్రి మహమూద్ అలీని అత్తాపూర్ డివిజన్ బీఆర్ఎస్ సీనియర్‌నాయకులు గుర్రంపల్లి యాదగిరి, పుష్పాల లక్ష్మణ్‌లు ఆదివారం కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బొకే అందజేసి ఘనంగా సన్మానించారు.

- శ్రీనివాస సేవా సమితి వ్యవస్థాపకుడు పెంద్యాల సాయిమాలిక్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. వెంకట్, సాయికిరణ్, వివేక్, రాహుల్, దినేష్, సుజిత్‌లు ఎమ్మెల్యేను కలిశారు.



మంత్రి సబితాఇంద్రారెడ్డికి..

- విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డిని నియోజకవర్గ బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కొలన్ సుభాష్‌రెడ్డి ఆధ్వర్యంలో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. డి.రమేష్ ముదిరాజ్, జె.చిత్తారీ, బాబు, వడివేలు, శివ తదితరులున్నారు.



మంత్రి మహమూద్ అలీకి..



ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌కు..



బీఆర్ఎస్ నాయకుడు కార్తీక్‌రెడ్డితో..